క్లుప్తంగా

విగ్రహావిష్కరణకు తరలిరండి

మాడ్గుల: కల్వకుర్తి సమీపంలోని కొట్రగేటు చౌరస్తాలో 28న కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి విగ్రహావిష్కరణకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలని మాడ్గుల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి కోరారు. మాడ్గులలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని కొట్రగేటు వద్ద ఏర్పాటు చేసిన ఉత్తమ పార్లమెంట్ అవార్డు గ్రహీత, కేంద్రమాజీ మంత్రి దివంగత సూదిని జైపాల్ రెడ్డి విగ్రహాన్ని ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారన్నారు. అనంతరం నిర్వహించే బహిరంగ సభకు మాడ్గుల మండల గ్రామాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు, జైపాల్ రెడ్డి అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని ఆయన కోరారు.

శ్మశానవాటిక స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్

ఇబ్రహీంపట్నం: క్రిస్టియన్లకు కేటాయించిన శ్మశానవాటిక స్థలాన్ని మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దీపక్ జాన్ శుక్రవారం పరిశీలించారు. ఇబ్రహీంపట్నం గోశాల రోడ్డులోని 38 సర్వేనెంబర్‌లో 5 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ఈ స్థలంలో శ్మశానవాటిక నిర్మాణానికి సంబంధించి పనులు చేపడుతామని, దీనికోసం త్వరలో నిధులు కేటాయిస్తామని చైర్మన్ దీపక్ జాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ ఎండీ సబితా, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి నవీన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఐ క్రిష్ణ, సర్వేయర్ సాయి, రెవరెండ్ సత్యం, పాస్టర్ విక్టర్ తోపాటు రాజు, కృష్ణపాల్‌లు పాల్గొన్నారు.

మొబైల్ స్టోర్ ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న వీవో జనరల్ మేనేజర్ ఆతీష్‌భార్గవ్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం మల్టీబ్రాండ్ రిటైల్ చైన్ షాపు సెల్‌బే మొబైల్ స్టోర్‌ను వీఓ జనరల్ మేనేజర్ ఆతీష్‌భార్గవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సెల్‌బే వ్యవస్థాపకుడు సోమనాగరాజు మాట్లాడుతూ సెల్‌బే ద్వారా అత్యుత్తమ ఉత్పత్తులు, సేవలను అందింస్తున్నామని చెప్పారు. ఈ కంపెనీని నగరాలతో పాటు మారుమూల గ్రామాలలో కూడా సేవలు అందించడానికి ప్రారంభించనున్నామని అందులో భాగంగా ఆమనగల్లులో ప్రారంభించామని చెప్పారు. ప్రారంభ సందర్భంగా వినియోగదారులకు పెద్ద ఎత్తున ప్రారంభ ఆఫర్లు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సెల్‌బే యాజమాన్యం సుహాస్ నల్లచెరు, సుదీప్ నల్లచెరు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

మున్సిపల్ కమిషనర్ వసంత



సాకిబండ తండాలో తొట్టిలోని నీటిని తొలగిస్తున్న కమిషనర్ వసంత

ఆమనగల్లు: పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా సిబ్బంది విధులు నిర్వహించాలని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ వసంత కోరారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని వివిధ తండాలలో శుక్రవారం కమిషనర్ వసంత పర్యటించారు. ఈ సందర్భంగా ఫ్రైడే డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం పలు ఇండ్లలోని నీటి తొట్లలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు.

విరివిగా మొక్కలు నాటండి

కందుకూరు: చిన్నతనం నుంచే చెట్లను విరివిగా నాటి సంరక్షించుకోవడం ఓ బాధ్యతగా చేపట్టాలని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు జయ మోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మొక్కలు నాటడం వరకే కాకుండా, నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకుందామన్నారు. చెట్లు ప్రగతికి మెట్ల లాంటివన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఎండీ అబ్దుల్లా, ఉపాధ్యాయులు గ్లోరి, సురేష్, కృష్ణ, కరుణాకర్, కౌసల్య, డాక్టర్ ఎండీ బషీర్, వాణిశ్రీ, సిబ్బంది సర్వర్, శ్రీశైలం, హుస్సేన్, విద్యార్థులు పాల్గొన్నారు.



తలకొండపల్లి: మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి తదితరులు



కడ్తాల్: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రైతు సంక్షేమానికి పెద్దపీట

- విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం
- కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి

తలకొండపల్లి: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ రైతు ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసేవిధంగా ఉందని కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని, ఈ పథకం కింద పేదలకు ఇండ్లు నిర్మించుకోవడానికి రూ. 5 లక్షలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ వ్యవసాయరంగానికి కూడా అధిక నిధులు కేటాయించి రైతుల పక్షపాతిగా నిలిచిందన్నారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయడంతో చరిత్రలో ఎవరికీ దక్కని ఈ ఘనత సీఎం రేవత్‌రెడ్డి దక్కడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్‌యాదవ్, క్రియాశీలక కార్యవర్గ సభ్యుడు యాదయ్య, అసెంబ్లీ సోషల్ మీడియా ఇన్‌చార్జి అజీం, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి..

కడ్తాల్: దళితుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్ పేర్కొన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దళితుల సంక్షేమానికి అధిక మొత్తంలో నిధులు కేటాయించడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీక్యానాయక్, బీచ్యానాయక్, భాస్కర్‌రెడ్డి, శంకర్, హన్మానాయక్, వేణుగోపాల్, శ్రీశైలం, భరత్‌యాదవ్, నర్సింహ, శ్రీను, మల్లయ్య పాల్గొన్నారు.

విద్యారంగానికి తీరని అన్యాయం

ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం

ఇబ్రహీంపట్నం: విద్యారంగానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో తీరని అన్యాయం రాష్ట్ర ప్రభుత్వం చేసిందని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు వంశీ, కార్యదర్శి తరంగ్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం విద్యారంగానికి నిధుల కేటాయింపులో వివక్ష చూపించారంటూ ప్రభుత్వ దిష్టి బొమ్మను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడ్జెట్ ప్రసంగంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మండల స్థాయిలో ఇంటర్నేషనల్ పాఠశాలల ఊసేఎత్తలేదన్నారు. ఓటాన్ బడ్జెట్‌లో కేటాయించిన నిధుల కంటే తక్కువ నిధులను ఈ బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించడం అన్యాయమన్నారు. యూనివర్సిటీల అభివృద్ధికి కేవలం రూ.500కోట్లు కేటాయించి చేతులు దులుపుకుందన్నారు. ఈ బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి మరిన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీకాంత్, రాకేష్, ముబీన్, లక్ష్మణ్, సందీప్, శివ, సైదులు, జస్వంత్‌లు పాల్గొన్నారు.

ఆమనగల్లు: ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఏబీవీపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం జాతీయ రహదారిపై రాజీవ్‌చౌరస్తా వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ. 7వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. వెంటనే మెగా డీఎస్సీని ప్రకటించాలని, ఫీజు నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు గోరటి భరత్, లండం మల్లేశ్, అంజి, మల్లేశ్, విజయ్, సిద్ధు, ప్రసాద్, ఠాగూర్, చరణ్, రాకేశ్, కల్యాణ్ పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు



ఆమనగల్లు: రాజీవ్‌చౌరస్తా వద్ద దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

అభివృద్ధి పనులను పూర్తిచేయండి

జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ డిమాండ్

ఆమనగల్లు: బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆమనగల్లు పట్టణంలో ప్రారంభించిన వివిధ అభివృద్ధి పనులను వెంటనే పూర్తిచేయించాలని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ డిమాండ్ చేశారు. శుక్రవారం అనురాధ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఆమనగల్లు పట్టణంలో రూ.2.5 కోట్లతో జూనియర్ కళాశాల భవన నిర్మాణం ప్రారంభించారని ప్రస్తుతం 70శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. రూ.4.5 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులను ప్రారంభించగా ప్రస్తుతం అసంపూర్తిగా ఉందని ఆమె వివరించారు. మండల పరిధిలోని మేడిగడ్డ తండా నుంచి శంకరకొండ తండాకు రూ.3.27 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించగా అసంపూర్తిగా ఉందని ఆమె వివరించారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను ప్రభుత్వం వెటనే పూర్తిచేయించాలని ఆమె కోరారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆమనగల్లు అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, మాజీ ఎంపీటీసీలు దోనాదుల కుమార్, పంతునాయక్, మాజీ సర్పంచ్ సోన శ్రీను నాయక్, గుత్తి బాలస్వామి, రమేశ్‌నాయక్, సతీష్, వెంకటేశ్, ప్రసాద్, శివకుమార్, యాదయ్య, ఆనంద్, గణేశ్‌నాయక్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న అనురాధ

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకండి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

ఇబ్రహీంపట్నం: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి జంగయ్య పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలంగా ఉన్న అన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేయాలన్నారు. ఇకపై స్థానిక సంస్థలపై దృష్టి పెట్టి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు.



మాట్లాడుతున్న జంగయ్య

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు ఉంటుందా లేదా అనే అంశంపై పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందన్నారు. గ్రామాల్లో పార్టీ నిర్మాణానికి ప్రతీ కార్యకర్త, నాయకుడు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నర్సింహ్మా, యాదిరెడ్డి, లక్ష్మయ్య, శివయ్య, కృష్ణ, జిల్లా గిరిజన సంఘం అధ్యక్షుడు రాజునాయక్‌లు పాల్గొన్నారు.

మూడు మండలాల పార్టీ బాధ్యుల నియామకం

ఈ సమావేశంలో మూడు మండలాల సీపీఐ బాధ్యులను నియమించారు. ఇబ్రహీంపట్నం మండల సీపీఐ కార్యదర్శిగా ములుగు నర్సింహ్మా, మంచాల మండల కార్యదర్శిగా రాజునాయక్, సహాయ కార్యదర్శులుగా మేకల రామకృష్ణ, గాలయ్యలను, యాచారం మండల పార్టీ కన్వీనర్‌గా నీలం శివయ్య, కో కన్వీనర్‌గా మస్కు సంజీవను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జంగయ్య తెలిపారు.

వ్యవసాయానికి అనుబంధంగా పశువుల పెంపకం

డెయిరీ రీజినల్ ఇన్‌చార్జి నర్సింగ్‌రావు

తలకొండపల్లి: వ్యవసాయానికి అనుబంధంగా పశువుల పెంపకం చేపడితే రైతులు ఆర్థికంగా ఎదగొచ్చని ఓ డెయిరీ ఇన్‌చార్జి నర్సింగ్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చుక్కాపూర్‌లో హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యంలో ఏజెంట్ శేఖర్ సహాయ సహకారాలతో పశువుల పెంపకంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ వర్షకాలంలో వాతావరణంలో కలిగే మార్పుల కారణంగా పశువులు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధులు, ఇతర వ్యాధుల బారి నుంచి పశువులను కాపాడుకోవాలని పేర్కొన్నారు. తదనంతరం పశు గ్రాసం పెంపకం, వ్యాధుల నివారణా, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాల దిగుబడి, మేలు జాతి గెదేలతో కలుగు ప్రయోజనాలు, నీటి వాడకం, పశువుల మేత, తదితర వాటి గురించి చర్చించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటేశం, సూపర్‌వైజర్ శివ, ప్లాంట్ మేనేజర్ నరేశ్, డాక్టర్ ప్రభాకర్, పాల ఏజెంట్ కాగుల శేఖర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నర్సింగ్‌రావు

డాక్టర్ సురేష్‌బాబు బదిలీ

ఇబ్రహీంపట్నం రూరల్: ఎల్మినేడు పశువైద్యశాల డాక్టర్ సురేష్‌బాబు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హయత్‌నగర్‌లో పని చేస్తున్న సీనియర్ వైద్యులు డాక్టర్ ఆనంద్‌రెడ్డి బదిలీపై వచ్చారు. డాక్టర్ ఆనంద్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన డాక్టర్ సురేష్‌బాబు నారాయణగూడ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి బదిలీ అయ్యారు. 12 సంవత్సరాలుగా సుదీర్ఘ కాలంగా పని చేసి రైతుల మన్ననలను పొందారు.

కార్గిల్ అమరులకు ఘన నివాళి



కార్గిల్ అమరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

కడ్తాల్: కార్గిల్ విజయ్‌దివస్‌ను పురస్కరించుకుని బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు సభావత్ సురేశ్ ఆధ్వర్యంలో, కార్గిల్ యుద్ధంలో పోరాడి అమరులైన వీరజవాన్లకు, శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఘన నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన భారత సైన్యానికి, జవానుల కుటుంబాలకు దేశ ప్రజలు ఎప్పటికి రుణపడి ఉంటారని పలువురు నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేవైఎం అధికార ప్రతినిధి భగీరథ్,నాయకులు శ్రీశైలంగౌడ్, కుమార్, అజిత్, రాకేశ్, సిద్దార్థ్, నందీశ్వర్, దశరథం, అరుణ్, భరత్ తదితరులు ఉన్నారు.

కడ్తాల్ ఎంపీఓగా విజయ్‌కుమార్ పాల్

కడ్తాల్: కడ్తాల్ మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ)గా విజయ్‌కుమార్ నియమితులయ్యారు. అదే విధంగా మండల కేంద్రంతో పాటు, మండల పరిధిలోని పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు కూడా నియామకమయ్యారు. కడ్తాల్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా అల్లాజీ, వాస్‌దేవ్‌పూర్‌కు చొటే, మద్రిపల్లికి శ్రీలక్ష్మి, రావిచేడ్‌కు తిరుపతి, మక్తమాదారానికి వెంకట్‌రెడ్డి, కొండ్రిగానిబోడ్‌తండాకు కుమార్, పెద్దవేములోని బావితండాకు లక్ష్మణ్, గానుగుమార్ల తండాకు పరమేశ్వర్, గడ్డమీది తండాకు రాఘవేందర్, గోవిందాయిపల్లి తండాకు శివప్రసాద్, కర్కల్‌పహాడ్‌కు జంగయ్య, చల్లంపల్లికి సందీప్, మైసిగండికి జంగయ్యలు కార్యదర్శులుగా నియామకమయ్యారు.



విజయ్‌కుమార్ పాల్



పరమేశ్

పీఆర్‌ఏఈగా పరమేశ్..

పంచాయతీ రాజ్ ఏఈగా పరమేశ్ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇంచార్జిగా ఉన్న పరమేశ్, రెగ్యూలర్ ఏఈగా నియామకమవ్వడంతో బాధ్యతలు స్వీకరించారు.

సమస్యలు పరిష్కరించడంలో విఫలం

పోచారం మాజీ సర్పంచ్ బలరాం యాదవ్

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించడంలో విద్యుత్‌శాఖ అధికారులు పూర్తిగా విఫలం అయ్యారని పోచారం మాజీ సర్పంచ్ బలరాం యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలంలోని పోచారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానికంగా ఉన్నటువంటి లైన్‌మెన్, ఏఈలకు ఎన్ని సార్లు సమస్యలపై ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. గ్రామ పంచాయతీ ప్రక్కన హనుమాన్ టెంపుల్‌సమీపంలో ఉన్న సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. ఈ విషయంలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో జిల్లా స్థాయి విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేలా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.



పండ్లు, కూరగాయలతో రోగనిరోధక శక్తి పెరుగుదల



కూరగాయలతో అలంకరించి అమ్మవారికి విద్యార్థుల పూజలు

మీర్‌పేట: మానవాళికి ప్రకృతి అందించిన గొప్ప వరం పండ్లు, కూరగాయలని నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మీర్‌పేట నాగార్జున మాంటిస్సోరీ, ఐఐటీ ఒలింపియాడ్ స్కూల్‌లో నిర్వహించిన శాకాంబరి ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీజనల్ వారీగా లభించే పండ్లు, కూరగాయలు తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. పోషక విలువల గురించి చిన్నారులకు అవగాహన కల్పించేందుకే పాఠశాలలో ఏటా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.మహేష్, ఇన్‌చార్జిలు దుర్గ, సంధ్య, ప్రశాంతి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలు ప్రబలకుండా అప్రమత్తత ముఖ్యం



వాదే ముస్తఫా బస్తీలో సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ వాణిరెడ్డి

జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి

పహాడీషరీఫ్: వర్షాకాలంలో ప్రజలు విష జ్వరాల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాం కాలనీ, వాదే ముస్తఫా బస్తీలలో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను 18వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, 21వ వార్డు కౌన్సిలర్ ఫమిదా అఫ్జల్‌లు ఆమెకు వివరించారు. ముఖ్యంగా డెంగీ వ్యాధి ప్రబలుతున్న నేపథ్యంలో దోమల నివారణ కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఎప్పటికప్పుడు ఫాగింగ్ నిర్వహించడంతో పాటు చెత్త పడేసే పాయింట్ల వద్ద బ్లీచింగ్ పౌడర్‌ను కూడా చల్లుతున్నామన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక ప్రణాళికలను రూపొందించామన్నారు. ప్రజలంతా తమ ఇళ్లల్లో నీటిని ఎక్కువ రోజులు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. వారానికి ఒకరోజు నీటిని పూర్తిగా పారబోసి, కొత్తగా పట్టుకోవాలన్నారు. వేడి చేసి చల్లార్చిన నీటిని తీసుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎప్పటికప్పుడు చెత్తా చెదారాలు లేకుండా తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. పాడైన రోడ్లకు కూడా మరమ్మతులు చేపడుతామని తెలిపారు. 22వ వార్డులో బీఆర్ఎస్ నాయకుడు సయ్యద్ హుస్సేన్ సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు.

కాలనీల సమస్యలు పరిష్కరిస్తాం



డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత, కార్పొరేటర్ స్వప్న

మేయర్ చిగురింత పారిజాతారెడ్డి

బడంగ్‌పేట్: కాలనీల్లో నెలకొన్న సమస్యలను ఆయా కార్పొరేటర్లతో కలిసి పరిష్కరిస్తామని బడంగ్‌పేట్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి తెలిపారు. శుక్రవారం కార్పొరేషన్‌లోని 30వ డివిజన్‌లోని మెట్రో కాలనీలో రూ.18 లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను ఆమె స్థానిక కార్పొరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. డివిజన్ల అభివృద్ధి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఎన్నికల కోడ్ వల్ల అభివృద్ధి పనులు ఆగిపోయినట్లు గుర్తు చేశారు. మెట్రో కాలనీలో డ్రైనేజీ పూర్తి అయిన వెంటనే సీసీ రోడ్లు వేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈఈ బిక్కునాయక్, నాయకులు రాకేష్, యాదగిరి కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

వర్గీకరణకు అనుకూలంగా బిల్లు పెట్టాలి

కందుకూరు: ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా పార్లమెంట్‌లో బిల్లు పెట్టి అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు చిన్నగళ్ల యాదగిరి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గడ్డం రాంచందర్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆగస్టు 9న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఏబీసీడీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న ఎస్సీ వర్గీకరణను చేపట్టకపోవడం బాధ్యతారాహిత్యమేనన్నారు. వర్గీకరణ చేస్తారని ఎస్సీలు బీజేపీని బలపర్చారన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయకపోతే రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆదిరాల రవికుమార్, జిల్లా ఇన్‌చార్జి దేవని నర్సింహా, పెద్దరామయ్య, బొర్ర రాములు, ఎ.బాల్‌రాజ్, ఉన్ని వెంకటయ్య, ఊటు యాదగిరి, కె.క్రిష్టోఫర్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు